క్లుప్తంగా

8న స్పాట్ అడ్మిషన్లు

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్లకు విద్యార్థులకు ఈనెల 8న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేష్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికిగాను 6, 7, 8, 9, 10 తరగతులకు మిగిలిన సీట్ల భర్తీకి అలాగే ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లలో మిగిలిన సీట్లకు విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. పరకాల నుంచి కోర్కిశాల స్కూల్ వరకు ఆర్టీసీ బస్ సౌకర్యం కూడా ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

73మందికి వైద్యపరీక్షలు



మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. దీంట్లో భాగంగా వైద్యాధికారి వినయ్‌భాస్కర్ 73 మంది రోగులకు షుగర్, బీపీ, డెంగీ, మలేరియా, ప్లేట్‌లెట్స్‌కౌంట్ పరిశీలించి మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్షాకాలం సీజన్‌లో పాటించాల్సిన సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజయ్‌కిరణ్, హెల్త్ సూపర్‌వైజర్స్, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై పవన్‌కుమార్

కాళేశ్వరం: మహదేవపూర్ గ్రామానికి చెందిన పోత సమ్మయ్య సెల్ ఫోన్ గత నెలలో పోగొట్టుకున్నాడు. ఈ మేరకు మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను 10 రోజుల్లో గుర్తించి బాధితుడికి శుక్రవారం ఎస్సై పవన్‌కుమార్ అందజేశారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ పున్నం ఉన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న సిబ్బంది

చిట్యాల: మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు జీపీ సిబ్బంది రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ అంకం సదానందం ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది పెండ్లి యుగేందర్, బానోత్ రాకేష్, బొజ్జపల్లి రాజయ్య , సతీష్ , సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం ఎదురుచూపు

- దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు
- 14న జారీ చేయనున్న ప్రభుత్వం



రేషన్ షాపు వద్ద లబ్ధిదారులు

టేకుమట్ల: ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావానికి ముందుకు కాంగ్రెస్ హయాంలో నూతన రేషన్ కార్డులను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అనంతరం బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు చేర్చడం, తొలగించడం మాత్రమే చేశారు. 2022లో కొన్ని రేషన్ కార్డులను మంజూరు చేసి, పిల్లల పేర్లు చేర్చడం కూడా కొంత సమయాన్ని మాత్రమే ఇచ్చి అనంతరం పేర్లను చేర్చే ఆప్షన్ కూడా తీసేయడంతో ఇప్పటి వరకు సుమారు గ్రామానికి 10 సంవత్సరాలుగా నూతన కార్డులు రాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశలో ఉన్నారు. కాగా, గత కొద్ది రోజులుగా ప్రస్తుత ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుంది.

14న కార్డుల జారీ..

రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలు పొందలేని వారికి ఈనెల 14న నూతన రేషన్ కార్డుల జారీ కోసం ప్రభుత్వం ప్రకటన చేయడంతో ఎంతో మంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడెప్పుడు నూతన రేషన్ కార్డులు వస్తాయో అని ఎదురు చూస్తున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించడం, చేర్చడం వంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఎక్కువగానే ఉన్నా, నూతన రేషన్ కార్డుల 326 మంది దరఖాస్తు చేసుకున్నారు.

అందనున్న ప్రభుత్వ పథకాలు

నూతన రేషన్ కార్డులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రేషన్ బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, తదితర సంక్షేమ పథకాలకు అర్హులు కానున్నారు. ఇటీవల యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లలో రేషన్ కార్డులు లేక అనర్హులుగా మారిన వారికి నూతన రేషన్ కార్డు ఒక వరంగా మారనుంది. నూతన రేషన్ కార్డుల కోసం ఎంతో మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. కానీ కొంత మంది లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

ఎదురు చూస్తున్నా..



నాకు పెళ్లైన నాటి నుంచి నూతన రేషన్ కార్డు కోసం ఎదురు చూశా. అమ్మా నాన్నలతో రేషన్ కార్డులో ఉన్నా. నాకు ఇద్దరు పిల్లలు కాగా వారికి ఇప్పటి వరకు రేషన్ కార్డులో పేర్లు లేవు. ఇటీవల నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నా. పిల్లలతో కలిసి నూతన రేషన్ కార్డు భవిష్యత్‌లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– గిరవేని కిరణ్, అంకుషాపూర్

సంక్షేమ పథకాలు కోల్పోయా..



నాకు పెళ్లై ఎనిమిదేళ్లు కాగా ఇప్పటి వరకు రేషన్ కార్డు లేదు. ఇద్దరు పిల్లలు కాగా రేషన్ కార్డు కోసం కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూశా. ఇటీవల నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పుడు పిల్లలతో పాటు నూతన రేషన్ కార్డు రానుండంతో సంతోషంగా ఉంది. గతంలో రేషన్ కార్డు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను సైతం కోల్పోయాను.

– ఊటిపెల్లి సమ్మయ్య, రామకిష్టాపూర్(వి)

మొరం అక్రమంగా తరలిస్తే చర్యలు



వాహనాలను సీజ్ చేసి అరెస్ట్ చూపుతున్న అధికారులు

టేకుమట్ల: ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎఫ్‌ఆర్‌ఓ నరేష్ బస్వా అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవాపూర్ శివారు ప్రాంతంలో ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలను చేపడుతున్నారనే సమాచారంతో దాడులు చేశారు. ఈ దాడుల్లో అక్రమంగా మొరం తరలిస్తున్న ఏడు టిప్పర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం అనుమతులు తీసుకుని మొరాన్ని తరలించాలని అన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా మొరం తవ్వకాలు చేపడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమ మార్గాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఆయన వెంట డీఆర్‌ఓ రత్న జ్యోతి, భూపాలపల్లి , చెల్పూర్ ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సమ్మేళన సభకు తరలిన నాయకులు



మొగుళ్లపల్లి: సమ్మేళనానికి వెళ్తున్న నాయకులు



టేకుమట్లలో..

టేకుమట్ల: హైదరాబాద్‌లో గ్రామ శాఖ అధ్యక్షులతో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఖర్గే నిర్వహిస్తున్న సమావేశానికి కాంగ్రెస్ నాయకులు అత్యధిక సంఖ్యలో వెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న రోజులలో కాంగ్రెస్ జెండా ఎగవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో తలపెట్టిన కాంగ్రెస్ సమ్మేళానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు భారీగా తరలివెళ్లారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రిషితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: జిల్లాకేంద్రంలో ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అన్నం రిషిత అండర్–12 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయికి ఎన్నికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గాజర్ల శ్రీనివాస్ తెలిపారు. రిషిత జూలై ఆరున హనుమకొండలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో భూపాలపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. రిషితను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరగాని కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ఖ్యాతిని పెంపొందించాలని ఆకాంక్షించారు.

మల్హర్‌లో..

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు కొడారి ఓంకార్, జల్లారపు అక్షయ ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 6న హనమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచందరావు, ఫిజికల్ డైరెక్టర్ పక్కల రాజబాబు తెలిపారు. దీంతో విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.

మహదేవపూర్‌లో..

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి మాడిగ అక్షిత రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ టీచర్ గుర్సింగ పూర్ణిమ శుక్రవారం తెలిపారు. విద్యార్థి ఎంపికపై ఎంఈఓ ప్రకాష్‌బాబు, హెచ్‌ఎం సరిత అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు మడక మధు, సుధారాణి, దేవి, ఒలిపాషా, శ్రీనివాస్, వసుదప్రియ, వీరేశం, సమ్మయ్య, లీలారాణి, రజిత, షాహెదా బేగం, ప్రసూన, దీపిక, ఆంజనేయులు, అజ్మత్ పాషాలు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు చోటివ్వొద్దు

- కాటారం డీఎస్పీ సూర్యనారాయణ



కార్డన్ సెర్చ్‌లో డీఎస్పీ సూర్యనారాయణ

కాటారం: గ్రామాల్లో అసాంఘిక శక్తులు, అసాంఘీక కార్యక్రమాలకు చోటు ఇవ్వొద్దని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలోని గంటగూడెంలో శుక్రవారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన పత్రాలు లేని దాదాపు 72 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు, చెడు వ్యసనాలు, చెడు స్నేహానికి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని చిన్న పిల్లలకు మొబైల్ ఫోన్‌లు ఇవ్వద్దని సూచించారు. ప్రతీ వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్డెన్ సర్చ్‌లు సీఐ నాగార్జునరావు, ఎస్సైలు మ్యాక అభినవ్, మహేందర్‌కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

చిట్యాల: భారత విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను మండల కేంద్రంలో శుక్రవారం మండల అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య హాజరై మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు, భారత విప్లవ వీరుడు మన్యం ప్రజల ఆరాధ్య దేవుడు అల్లూరి సీతారామారాజు అన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎవైఎస్ నాయకులు రాజేందర్, సాంబయ్య, తిరుపతి, రాజు, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలు కొనసాగించాలి



మల్హర్: కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చిట్యాలలో..

మల్హర్: దొడ్డి కొమురయ్య ఆశయాలు కొనసాగించాలని బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య అన్నారు. మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డు కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమ్మయ్యు మాట్లాడుతూ.. అమరవీరుడు కొమరయ్య ఆశయాలు కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకుడు తాజుద్దీన్, యాదవ సంఘం డివిజన్ నాయకుడు బోయిని రాజయ్య, రజక సంఘం మండల అధ్యక్షుడు పావిరాల ఓదెలు, పావిరాల లక్ష్మణ్, నాయీ బ్రాహ్మణ సంఘం మండల ప్రధాన కార్యదర్శి అడ్డురి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలో గొర్ల మేకల పెంపకదారుల సంఘం మండల అధ్యక్షుడు మర్రి నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం దొడ్డి కొంరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు చేపూరి ఓదేలు హాజరై మాట్లాడుతూ.. నైజాం నిరంకుశ పాలనపై రజాకార్లపై భూమి కోసం భుక్తి కోసం ఎదురోడి పోరాడి ప్రాణాలకు తెగించి దేశ్ముకులను తమిరికొట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో కంచు కుమార్ ఉమ్మనవేని రాజు, కట్టికోళ్ల శశికుమార్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కర్ణాటకపు సమ్మయ్య

భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని రైతు స్వరాజ్య వేదిక నాయకులు కర్ణాటకపు సమ్మయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతులకు తీరని అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అఖిల భారత సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో, చల్లగురుగుల సంజీవ్, జిల్లా కమిటీ కో కన్వీనర్ యాస నర్సయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ అందజేత



టీవీ అందజేస్తున్న దాతలు

చిట్యాల: మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు డిజిటల్ విద్యను అభివృద్ధి పరచాలనే ఉద్దేశ్యంతో పూర్వ విద్యార్థి తోట బాబన్నసంధ్య దంపతులు రూ.22వేలు విలువ చేసే టీవీని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరగాని కృష్ణకు అందజేశారు. అనంతరం జాతీయ స్థాయి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనా విద్యార్థి కైటం అభిలాష్‌ను రూ.రెండు వేలు నగదు పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా తోట బాబన్న–సంధ్య దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కోరుకొప్పుల కావ్య, ఉపాధ్యాయులు సునీత, పాఠశాల మాజీ చైర్మన్ దొంతి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డాక్టర్ వాణి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వాణి

మొగుళ్లపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ వాణి అన్నారు. శుక్రవారం మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ.. వర్షకాలంలో సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు తినాలన్నారు. ఈ వైద్య శిబిరంలో 41 మందికి పరీక్షలు చేసి ఇద్దరి రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేదెప్పుడో?

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని రహదారి
- బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద నిలిచిన పనులు
- వానలు పడితే తప్పని తిప్పలు



వాజేడు వద్ద హైలెవెల్ బ్రిడ్జి వద్ద పూర్తి కాని రహదారి

వాజేడు: ప్రధాన మంత్రి గ్రామీన సడక్ యోజన కింద మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి నుంచి ఏడ్జెర్ల పల్లి గ్రామంవరకు రహదారి మంజూరైంది. ఈ రహదారి పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. రోడ్డు నిర్మాణం చేపట్టిన బ్రిడ్జిల, కల్వర్టుల వద్ద అలానే వదిలేశారు. ఎప్పుడు ఈ పనులను పూర్తి చేస్తారో తెలియని దుస్థితి.

నిలిచిన పనులు

గుమ్మడిదొడ్డి నుంచి ఏడ్జెర్లపల్లి గ్రామం వరకు రెండు చోట్ల కల్వర్టుల వద్ద, మూడు చోట్ల బ్రిడ్జిల వద్ద రహదారి పనులను పూర్తి చెయలేదు. ఏడ్జెర్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న తోగు వద్ద కల్వర్టుకు గుంత పడింది. ఇక్కడ కనీసం కల్వర్టు నిర్మాణం కూడా చేయలేదు. ఏడ్జెర్లపల్లి పూసూరు మధ్యన ఉన్న బొమ్మనపల్లి వాగును దాటిన తరువాత నిర్మించిన బ్రిడ్జి వద్ద పనులు అసంపూర్తిగా వదిలేశారు. పుసూరుకు సమీపంలో ఉన్న రెండు కల్వర్టుల వద్ద, మండల కేంద్రంలోని హైలెవెల్ వంతెన వద్ద, కొంగాల వా గుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద రహదారి పనులు చేపట్టలేదు.

వానలు పడితే ఇబ్బందులు

వర్షాలు పడితే ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తప్పవు. భారీ వర్షాలు కురిస్తే బ్రిడ్జిల వద్ద వాహనాలు దిగబడే అవకాశం కూడా ఉంది. కొంగాల వాగు బ్రిడ్జి వద్ద ఇక్కడ గత వర్షాకాలం ఆర్టీసీ బస్సు దిగబడగా పోలీసులు, ఇతర శాఖల అధికారులు క్షేమంగా బయటకు తీసి పంపించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేమంగా వారి ఇళ్లకు తరలించారు. ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బొమ్మనపల్లి వాగు సమీపంలోని బ్రిడ్జి వద్ద..



కొంగాల వాగు బ్రిడ్జి వద్ద..



ఏడ్జెర్లపల్లిలో కల్వర్టు వద్ద పడిన గుంత



పూసూరు గ్రామ సమీపంలోని కల్వర్టు నిర్మించకుండా ఉన్న రహదారి

కొత్త పెన్షన్లు ఇవ్వాలి

భూపాలపల్లి రూరల్: వృద్ధులకు, వితంతులకు, వికలాంగులకు కొత్త పెన్షన్‌లు వెంటనే ఇవ్వాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనటలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పాలనకాలంలో చేసిన రోజులు కొత్త పింఛన్లు ఇవ్వలేదని, కాంగ్రెస్‌ను గెలిపిస్తే చేయూత అని నెలకు రూ.4000 అని చెప్పి ఇప్పటి వరకు ఒక్కరికి కూడా కొత్తపెన్షన్ ఇవ్వలేదన్నారు. సదరం క్యాంపు సర్టిఫికెట్ ఉన్నా గానీ పింఛన్లు ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమైన చర్యఅని అన్నారు.

విజయవంతంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స



శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా చేసినట్లు ఆస్పత్రి ఏసీఎంఓ డాక్టర్ పద్మజ తెలిపారు. ఈ నెల 3, 4న ఇద్దరు మహిళలకు మోకాలి మార్పిడి చికిత్సలు విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లను రామగుండం ఏరియా ఆస్పత్రి ఆర్థోసర్జన్ డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య బృందం, సిబ్బందిని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు.